క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం



తెనాలి: నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదిన సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీచక్ర సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సంబంధిత కరపత్రాన్ని శనివారం హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెయిన్‌బో బ్లడ్ సెంటర్ నిర్వాహకుడు నవీన్ చక్రవర్తి ఆవిష్కరించారు. రక్తదాన శిబిరంలో సేకరించిన రక్త యూనిట్లను తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. రక్తదాన శిబిరంలో జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ కమ్మెల హరీష్, డాక్టర్ మోహన్, శ్రీచక్ర హాస్పటల్ చైర్మన్ కమ్మెల శ్రీనివాసరరావు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటిజంపై అంగన్ వాడీలకు అవగాహన



తెనాలి: ప్రపంచ ఆటిజం అవాహన మాసోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని నాయుడుగారి కుండబిర్యానీ హోటల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. రాజేంద్ర స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏంజెల్ రిచర్డ్స్ మాట్లాడారు. పిల్లల్లో ఆటిజం లక్షణాలను ఎలా కనుగొనాలి? వాటిని ఎలా అధిగమించాలి అనే అంశాలను ఆమె తెలియజేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి సూపర్‌వైజర్ కొడాలి సౌజన్యశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

7న విజయవాడ ధర్నా జయప్రదం చేయాలి

తెనాలిటౌన్: ఈ నెల 7వ తేదీన విజయవాడ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ ఎంప్లాయిస్ తెనాలి డివిజన్ కమిటీ గౌరవాధ్యక్షులు కొల్లిపర బాబుప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ టిడ్కో కాలనీ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నేతలు ఇచ్చిన హామీలు ఒకటి కూడా అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు ఉన్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి

తెనాలిరూరల్: టిప్పర్ ఢీ కొట్టడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన తెనాలిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన వేజండ్ల వెంకట సుబ్బారావు(84) గతంలో బియ్యం వ్యాపారం చేసేవాడు. మార్కెట్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఇక్కడి ఓవర్ బ్రిడ్జిపై టిప్పర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

తెనాలిటౌన్: శనివారం కురిసిన అకాల వర్షానికి జొన్న కంకులు తడిస్తే ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్న కంకులు తడవడం వలన మొలకెత్తే ప్రమాదం ఉందని, దీని కోసం 5 శాతం ఉప్పు ద్రవణాన్ని పిచికారి చేసినట్లయితే మొలక రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలియజేశారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన



తెనాలిటౌన్: రైతులు, గ్రామస్తులు కలుపు మొక్కల నివారణపై అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ ఏర్పాటు చేశారు. క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ సువర్ణలత పాల్గొని గ్రామస్తులు, రైతులకు కలుపు మొక్కల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నేత జగ్జీవన్‌రామ్

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్



పార్టీ నేతలతో సహా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన శివకుమార్

తెనాలి: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం తెనాలిలో ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ పట్టణ అయితానగర్‌లోని లింగారావు సెంటర్లో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పార్టీ నేతలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించా రు. కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, వార్డు కౌన్సిలర్ గెద్దటి సురేంద్ర, కౌన్సిలర్ యాతాటి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన ఐఆర్ఎస్ అధికారి

తెనాలి: భారత మాజీ ఉపప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజైన శనివారం స్థానిక రైల్వేస్టేషను దగ్గర్లోని ఆయన విగ్రహానికి పలు సంస్థల నేతలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

దళితుల అభ్యున్నతికి..

తెనాలిఅర్బన్: దళితుల అభ్యున్నతికి బాబు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువరానిదని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు కొనియాడారు. మాజీ ఉపప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ జయంతిని శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆర్వో రాంప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

■ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని జైభీమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి మధుబాబు, నలుకుర్తి రమేష్, అత్తోట శరత్, సద్గుణరావు, కఠెవరపు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

తెనాలిటౌన్: దేశంలో ఆనాడు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి వాటి అమలుకు కృషి చేసిన మానవతావాది డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని ఆది జాంబవ దళిత ఎంప్లాయిస్ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ పి.జె. రత్నాకర్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి ఉన్నం ఏహేస్కేల్, సభ్యులు శరత్ వెంకయ్య, ఉన్నం లక్ష్మయ్య, యడ్లపల్లి రవికిరణ్, సుద్దపల్లి మురళిధర్, కొలకలూరి పాపారావు, పినపాటి అనిల్, మోదుకూరి గురుదేవ్, హేబెల్, సొపాటి శ్రీను, జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

■ రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలో కూటమి ఆధ్వర్యంలో స్వతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ నేతలు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రెసిడెంట్ కడియాల నందకిషోర్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కనగాల శ్రీనివాస్, మందా జనార్ధన్, విజయరాజు, ఎం.వీరయ్య, కె.ప్రసాద్, నలుకుర్తి విజయ, ఆశోక్, ఆలపాటి సుబ్బయ చౌదరి, ఖరీదు శ్రీరాము, పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కూటమి నేతలు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన ఆనంద్‌కుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు



నివాళులర్పిస్తున్న దళిత ఎంప్లాయిస్ సేవా సమితి సభ్యులు



వైభవంగా వసంత నవరాత్రి వేడుకలు

నేడు శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం



ఏర్పాటైన చలువ పందిరి



స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు

తెనాలి: పట్టణ గాడిబావి సెంటర్లోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం విశేష కుంకుమార్చన, శ్రీఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన చేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి త్రయాహ్నిక దీక్షా పూర్వక కళ్యాణ మహోత్సవాలను ఆరంభించారు. ధ్వజారోహణం, గరుడముద్దల ప్రసాద వినియోగం జరిగాయి. రాత్రి ఏడు గంటల్నుంచి శ్రీలక్ష్మీకూచిపూడి నృత్యకళాకేంద్రం ప్రిన్సిపాల్ ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి, జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు. ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన ఉదయం 9 గంటలలకు ఎదురుకోల ఉత్సవంతో శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణం ఆరంభిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ అమర్‌నాథ్, వ్యవస్థాపక ధర్మకర్త కోగంటి రాంబాబు తెలియజేశారు. కళ్యాణంలో కోగంటి ఫణికిషోర్–గీత దంపతులు పాల్గొంటారని టీటీడీ విశ్రాంత సమన్వయకర్త, వ్యాఖ్యాత, విజయవాడ మండవిక శ్రీకృష్ణ కుమార్‌శర్మ కళ్యాణ ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తారని తెలిపారు. సాయంత్రం శ్రీహనుమద్వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం ఉంటుంది. శ్రీఆంజనేయ ధ్యానయోగ మండలి వ్యవస్థాపకుడు కిషోర్ గురూజీచే ప్రవచనం ఉంటాయి. చివరగా శ్రీలాస్య కూచిపూడి నాట్యాలయం నిర్వాహకుడు జంధ్యాల వెంకట శ్రీరామచంద్రమూర్తి శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనలు ఉంటాయని వివరించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలను తీసుకోవాలని కోరారు.



కూచిపూడి నృత్యబృందం

విద్యతో పాటు నైతిక విలువలూ ముఖ్యమే

ఐఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐఆర్ఐఎస్ఈ రాష్ట్ర చైర్మన్ కోగంటి శ్రీకాంత్



బహుమతుల ప్రదానం చేస్తున్న శ్రీకాంత్

తెనాలి: విద్యార్థులు స్కూలు విద్యతోపాటు నైతిక విలువలను అలవరచుకోవాలని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్, ఐఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఐఆర్ఐఎస్ఈ రాష్ట్ర చైర్మన్ కోగంటి శ్రీకాంత్ సూచించారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లోనూ ప్రవేశం సాధించేందుకు కొంత సమయాన్ని కేటాయించాలని చెప్పారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ పాఠశాల 14వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. గుంటూరులోని స్టెమ్ పాఠశాల ప్రిన్సిపాల్, గుంటూరు డయోసిస్ సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యుడు రెవరెండ్ ఫాదర్ భరత్‌రెడ్డి యెరువా, పీపుల్ కంబైన్ డైరెక్టర్, ఓఆర్‌టీయూఏఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ (హైదరాబాద్) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న మండవ హాజరయ్యారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో వేడుకలను ఆరంభించారు. తమ విద్యాసంస్థలో విద్యనభ్యసించిన విదద్యార్థులు ఉన్నతస్థానాల్లో ఉన్నారని డాక్టర్ ప్రసన్న మండవ చెప్పారు. పాఠశాల విద్యార్థులు, విద్యార్థులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. నృత్యరూపకాలు, స్కిట్స్, దేశభక్తి గీతాలాపన, యోగ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. వెస్ట్‌బెర్రీ పాఠశాల ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, కార్య నిర్వహక అధికారి పర్యవేక్షించారు. సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెనాలిలో చిరుజల్లులతో కూడిన వర్షం



వర్షం పడటంతో రోడ్డుపై నిలిచిన నీరు

తెనాలిఅర్బన్: పట్టణంలో శనివారం మధ్యాహ్నం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. గత కొద్ది రోజుల నుంచి వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వర్షంతో కొంత సేదతీరారు. మధ్యాహ్నం అరగంట పాటు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. అప్పటి నుంచి వాతావరణం చల్లగానే ఉంటూ వచ్చింది.

7న కళాక్షేత్రంలో ధ్రువపత్రాల పరిశీలన

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అందించే వ్యక్తిగత సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాలకు చెందిన నిరుద్యోగల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు.

ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డు పథకం

- 'మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్'తో వివిధ కోర్సుల అభ్యాస శిక్షణ
- సీఎస్సార్ కింద విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిన శిక్షణ
- 5,500 కోర్సులకు పైగా అభ్యాసం
- పర్యవేక్షించిన ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శివకుమార్



'మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్' బస్సు వద్ద విద్యార్థులతో శివకుమార్



బస్సులో విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న శివకుమార్

తెనాలి: క్యాంపస్ ఎంపికల్లో అగ్రగామిగా కొనసాగుతున్న స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మరో అరుదైన అవకాశం లభించింది. వేలాది టెక్నికల్, నాన్‌టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులను ఉచితంగా నేర్చుకునేందుకు వీలుచిక్కింది. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ఇప్పటికే వివిధ సంస్థలతో ఎంఓయూలను కుదుర్చుకోవటంతో విద్యార్థులు పలు సర్టిఫికెట్ కోర్సులను పూర్తిచేసుకుంటూ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రఖ్యాత మల్టీనేషనల్ కంపెనీ ఇన్ఫోసిస్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కింద 'ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డు'ను అమల్లోకి తీసుకొచ్చింది. 'మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్' పేరుతో ప్రత్యేకమైన బస్సును సిద్ధంచేసుకుంది. అందులో రోబోటిక్స్ ట్రైనింగ్, ఐడీటీ, త్రీడీ ప్రింటింగ్ సహా 5,500 సర్టిఫికెట్ కోర్సులను విద్యార్థులు నేర్చుకునేందుకు వీలుగా ట్యాబ్స్, ల్యాప్‌టాప్‌లు, స్క్రీన్స్‌తో సహా అన్నిరకాల సాంకేతిక అంశలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు అవసరమైన స్కిల్ట్ సిబ్బందిని నియమించారు. ఇన్ని సదుపాయాలున్న 'మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్' బస్సు ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి విద్యార్థుల కోసం వచ్చింది. స్థానిక ఏఎస్ఎన్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో డిగ్రీ కాలేజీ విద్యా ర్థులకు బ్యాచ్‌కు ఇరవై మంది చొప్పున ఉచితంగా శిక్షణనిస్తున్నారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ శనివారం విద్యార్థుల శిక్షణను పరిశీలించారు. జాతీయంగా, అంతర్జాతీయంగా టెక్నాలజీలో వస్తున్న మార్పులను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామని గుర్తుచేశారు. ఆ క్రమంలో ఇప్పుడు ఇన్ఫోసిస్‌తో ఒప్పందంతో ముందుకెళుతున్నామనీ, 36 ఏళ్ల కృషితోనే తల్లిదండ్రులు, విద్యార్థుల ఆకాంక్షలను నెరవేరుస్తున్నట్టు చెప్పారు. డిగ్రీ కాలే జీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామ్‌చంద్ మాట్లాడుతూ పదిరోజుల్లో తమ విద్యార్థులు 600 మంది శిక్షణ తీసుకుంటారని చెప్పారు. ఇన్ఫోసిస్ ట్రైనర్ కార్తీక్ మాట్లాడుతూ రెండేళ్లకోసారి టెక్నాలజీలో వస్తున్న మార్పులను డబ్బుతో నేర్చుకోలేని విద్యార్థుల కోసం ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డును సంస్థ తీసుకొచ్చిందని చెప్పా రు. విద్యార్థులు స్వయంగా నేర్చుకుని ప్రతి కోర్సు కూ సర్టిఫికెట్ పొందవచ్చనీ వివరించారు. ఫలితంగా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు.

దరఖాస్తులు ఫుల్.. కనెక్షన్లు నిల్

- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రైతుల పాట్లు
- నియోజకవర్గంలో 531 దరఖాస్తుల పెండింగ్
- నెలల తరబడి ఎదురు చూస్తున్న రైతులు
- పంటలు ఎండుతున్నాయని ఆందోళన



పేరుకులపూడి పొలాల వద్ద నూతన కనెక్షన్ల కోసం తెచ్చిన స్తంభాలు

మంగళగిరి: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే జొన్న పంట కోతలకు మొదలు కాగా.. మొక్కజొన్న పంట కోతలకు సిద్ధమైంది. క్షేత్ర స్థాయిలో అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి నెలల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్న పరిస్థితి నెలకొంది. నూతన కనెక్షన్లు ఇస్తే విద్యుత్ వినియోగం పెరుగుతుందనుకున్నారో ఏమో అధికారులు.. ఆరు నెలలుగా నూతన కనెక్షన్‌లు ఇవ్వడం ఆపేశారు. పొలాల్లో వేసిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలు లాగడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో సకాలంలో నీరు పెట్టలేక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోతున్న దరఖాస్తులు

నియోజకవర్గంలో విద్యుత్ కనెక్షన్ల కోసం 389 దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి తోటు మరో 142 నూతన దరఖాస్తులు వచ్చాయి. ఏప్రిల్ నెలాఖరుకు పొలాలు ఖాళీ అవుతాయి. ఇక మే, జూన్ రెండు నెలల సమయం మాత్రమే ఉంటుంది. ఈ సమయాన్నే విద్యుత్ అధికారులు వినియోగించుకుని నూతన కనెక్షన్‌లు అందించాలి. మంగళగిరి నియోజకవర్గంలో దుగ్గిరాల మండలంలో అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. రైతులు నగదు చెల్లించగానే అధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారు. వర్క్ ఆర్డర్ వచ్చిన అనంతరం సబ్సిడి మీద కనెక్షన్‌లు ఇవ్వాలి. రైతు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరించి వాటితో స్టోర్ నుంచి విద్యుత్ నియంత్రికలు, కండెక్టర్లు, తీగలు తదితర సామగ్రి కొనుగోలు చే స్తారు. ఇప్పటికే స్తంభాలు తోలామని, పొలాల్లో త్వరలోనే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. దుగ్గిరాల ఏఈ వసంతరావు దీనిపై స్పందిస్తూ.. సాధారణంగా 3, 5 హెచ్‌పీ ఉన్న మోటార్లను రైతులు వినియోగిస్తున్నారు. ఒక్కొక్క హెచ్‌పీకి కిలోవాట్ లెక్కన రూ.1000 వరకు నగదు చెల్లించాలి. సెక్యూరిటీగా ఒక్కొక్క హెచ్‌పీకి రూ.40 చెల్లించాలి. మొక్కజొన్న కోతల అనంతరం కొద్దికాలం వేరే పంట వేయకుండా వదిలేస్తే విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చేందుకు సులభతరమవుతుంది.

కనకదుర్గ వారధిపై ప్రమాదం

తాడేపల్లి రూరల్ : కృష్ణానది కనకదుర్గ వారధిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ఘటనలో ప్రమాదం తప్పింది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి విజయవాడ వెళ్తున్న బొలెరొ వాహనానికి టైర్ పంక్చర్ కావడంతో వారధి 16వ పిల్లర్ వద్ద టైరు మార్చుకుంటున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనం ఒక్కసారిగా రిటైనింగ్ వాల్‌కు ఢీకొట్టడంతో వాల్ పూర్తిగా ధ్వంసమైంది. ఫుల్‌రెస్ట్‌పై బొలెరొ వాహనం ఆగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదు. ఇంకొంచెం వేగంగా గుద్ది ఉంటే బొలెరొ వాహనం కృష్ణానదిలో పడి ఉండేదని పోలీసులు భావించారు. వారధి నుంచి కుంచనపల్లి వరకు సుమారు 3 కిలోమీటర్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. జాతీయ రహదారి భద్రతా సిబ్బంది, తాడేపల్లి ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, బోల్తాపడిన వాహనాన్ని క్రేన్ సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



బోల్తాపడిన వాహనాన్ని క్రేన్ సాయంతో తరలిస్తున్న పోలీసులు